సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 6 । ఏప్రిల్ । 2023



గాలివాన బీభత్సం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం గాలి, వాన బీభత్సం సృష్టించాయి. పిడుగులు పడి పశువులు మృతిచెందాయి. 8లో




తపాలా వడ్డీ పెరిగింది..

తపాలా శాఖ నిర్వహిస్తున్న పలు పథకాలపై కేంద్ర ప్రభుత్వం వడ్డీ రేటు పెంచడంతో ఖాతాదారులకు ప్రయోజనం చేకూరనుంది. 10లో



వాతావరణం

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రత అధికంగానే నమోదవుతుంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం చిరు జల్లులు పడే అవకాశం ఉంది.



న్యూస్‌రీల్

సంత వేలం @ రూ.37.15 లక్షలు

బూర్గంపాడు: మండలంలోని మోరంపల్లిబంజర వారపు సంత వేలం పాట బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. 10 నెలల కాలానికి నిర్వహించిన ఈ వేలం పాటను పెనుబల్లి మండలం బయ్యన్నగూడెం గ్రామానికి చెందిన రాసా శ్రీనివాస్ రూ. 37.15 లక్షలకు దక్కించుకున్నారు. గతేడాది రూ. 33.90 లక్షలు కాగా, ఈ ఏడాది రూ. 3.25 లక్షల అధికంగా పలికింది. కార్యక్రమంలో డీఎల్‌పీఓ పవన్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, మండల పంచాయతీ అధికారి సునీల్, స్థానిక సర్పంచ్ భూక్యా దివ్యశ్రీ, పంచాయతీ కార్యదర్శి సాయి, ఉపసర్పంచ్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

సామాజిక సేవలకు అంతర్జాతీయ గుర్తింపు



అవార్డు అందుకుంటున్న సునీత

బూర్గంపాడు: బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో కమ్యూనిటీ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న తుళ్లబెళ్ల సునీత చేస్తున్న సామాజిక సేవలకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. సహృదయ సేవా సంస్థ ఫౌండర్‌గా ఆమె ఏజెన్సీ ప్రాంతంలో ఏడేళ్లుగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించగా.. సర్వకుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐరన్ లేడీ అవార్డును దక్కించుకున్నారు. పుణేలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె అవార్డు అందుకున్నారు. కరోనా, గోదావరి వరదల వంటి విపత్కర సమయాల్లో ఎంతోమందికి ఆమె సేవలందించారు. ఏజెన్సీలోని పేద విద్యార్థుల ఉన్నత చదువులకు, పేదల ఆరోగ్య సేవలకు చేయూత అందిస్తున్నారు. ఇలాంటి సేవల నేపథ్యంలో ఆమెకు తగిన గుర్తింపు లభించిందని అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

రంజాన్ మాసం.. ఎంతో పవిత్రం

సింగరేణి(కొత్తగూడెం): ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం రమేష్ అన్నారు. రుద్రంపూర్‌లో జమాతే ఇస్లామిక్ హింద్ వారు బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈనెల రోజులు ఉపవాసంతో పాటు, చెడు వినకుండా, చూడకుండా, మాట్లాడకుండా ఇతరుల పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండడం విశేషమన్నారు. ఎప్పుడూ అలాగే ఉండాలని ఆకాంక్షించారు. మనుషులు విలువలు కలిగిన మహోన్నతులుగా మారాలన్నదే ఖురాన్ ఉద్దేశమని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం శ్రీరమేష్, సింగరేణి అధికారులు సామ్యేల్ సుధాకర్, రమణారెడ్డి, టీబీజీకేఎస్ నాయకులు రజాక్, రుద్రంపూర్ సర్పంచ్ గుమ్మడి సాగర్, సీఎస్‌ఐ చర్చి ఫాదర్ ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రెజర్ హంట్ !

లక్ష్మీదేవిపల్లి మండలంలో గుప్త నిధులు లభ్యం ?

- జాగ్రత్త పరచాలంటూ ముఠాలో ఒకరికి అప్పగింత
- నిధి మొత్తం రాత్రికిరాత్రే అదృశ్యమైందన్న సదరు వ్యక్తి
- ఈ విషయంలో కిడ్నాప్‌లు, దాడులు, సెటిల్‌మెంట్లు
- ముఠాలోని లుకలుకలతో బయటకు పొక్కిన విషయం



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా కేంద్రంలో భాగంగా ఉన్న లక్ష్మీదేవిపల్లిలో మండల పరిధిలో గుప్తనిధుల అన్వేషణ పేరుతో అరాచకాలు జరుగుతున్నాయి. బృందాలుగా విడిపోయిన కొందరు వ్యక్తులు ఇష్టారీతిగా తవ్వకాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో నిధి విషయంలో బృందాల మధ్య పొరపొచ్చాలు రావడంతో పరస్పరం దాడులు చేసుకోవడం, వ్యక్తులను అపహరించడం వంటి చర్యలు చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది. విషయం గుప్త నిధులకు సంబంధించింది కావడంతో అటు దాడులు చేసిన వారు, ఇటు దెబ్బలు తిన్నవారు ఎవరూ బయటకు చెప్పడం లేదు. అయితే దాడులు, కిడ్నాప్ వ్యవహారం ఆ నోటా ఈ నోటా పడి అంతటా పాకుతోంది. మరి ఈ మొత్తం వ్యవహారానికి కారణమైన ఆ నిధి ఏమైందనే ప్రశ్న చిక్కుముడిగానే మిగిలినట్టు సమాచారం.

గుప్తనిధి లభ్యం?

జిల్లాలో గుప్త నిధుల కోసం అన్వేషణ సాగించే ముఠాలు, వారికి సహకరించే బ్యాచ్‌లు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. పగలు సామాన్యుల్లా కనిపించే వీరంతా రాత్రయితే చాలు పలుగు, పార పట్టుకుని తవ్వకాల పనుల్లో నిమగ్నమవుతున్నారు. ముఖ్యంగా కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో ఈ తరహా వ్యవహారాలు చాపకింద నీరులా సాగిపోతున్నాయి. ఇటీవల జిల్లా కేంద్రంలో 'ట్రెజర్ హంట్' చేస్తున్న 16 మంది నాలుగు బృందాలుగా విడిపోయి లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలో తమకు తెలిసిన పాయింట్లలో తవ్వాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు ఒక దగ్గర తవ్వగా పురాతన కాలానికి చెందిన విలువైన విగ్రహాలు, కొంత 'నిధి' బయటపడినట్టు తెలుస్తోంది. ఈ నిధులను జాగ్రత్త పరచాలంటూ అనిశెట్టిపల్లికి చెందిన ముఠాలోని ఓ సభ్యుడికి బాధ్యత అప్పగించారు. ఆ తర్వాత మిగిలిన పాయింట్ల దగ్గర అన్వేషణ చేపట్టినట్టు తెలిసింది.

నిధి మాయమైందంటూ సమాధానం..

లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలో నాలుగు పాయింట్లలో తవ్వకాల అనంతరం మొదట లభించిన నిధిని తీసుకురావాలని గతంలో జాగ్రత్త పరచమని ఇచ్చిన వ్యక్తిని ముఠాలోని మిగిలిన సభ్యులు కోరారు. అయితే సదరు వ్యక్తి 'ఇప్పుడు నా దగ్గర నిధి లేదని, ఇంట్లో పెడితే అది తనకు తెలియకుండా మాయమైందని, అందులో ఏదో అదృశ్య శక్తి ఉంది' అని సమాధానం ఇచ్చినట్టు తెలుస్తోంది. దీంతో హతాశులైన ముఠాలోని మిగిలిన సభ్యులందరూ కలిసి సదరు వ్యక్తిని 'నిధి' కోసం కిడ్నాప్ చేశారని, ఆ తర్వాత చాతకొండ పరిధిలో ఒక రహస్య ప్రదేశంలో బంధించి నిధి ఎక్కడ పెట్టావో చెప్పాలంటూ తీవ్రంగా కొట్టారని సమాచారం.

తండ్రీకొడుకుల కిడ్నాప్..

ఇంటి నుంచి బయటకు వెళ్లిన కొడుకు ఎంతకూ తిరిగి రాకపోవడంతో లక్ష్మీదేవిపల్లి మండలానికి చెందిన ఓ ఇటుకబట్టీల వ్యాపారి ఆరా తీయగా.. గుప్త నిధులు, కిడ్నాప్ వ్యవహారానికి సంబంధించిన విషయం తెలిసింది. దీంతో బందీగా ఉన్న తన కుమారుడిని విడుదల చేసుకునేందుకు గుప్త నిధుల ముఠాతో చర్చలకు వెళ్లినట్టు సమాచారం. అయితే తండ్రీ కొడుకులు ఇద్దరినీ బంధించి మరోసారి ఈ ముఠా దాడి చేసినట్టు తెలుస్తోంది. తన కుమారుడికి ప్రాణహాని తలపెట్టవద్దని, నిజానిజాలు తెలుసుకుని న్యాయం చేస్తానని సదరు వ్యాపారి హామీ ఇచ్చి అక్కడి నుంచి బయటపడ్డట్టు సమాచారం.

రూ. 10 లక్షల డీల్..

ట్రెజర్ హంట్ ముఠాతో జరిపిన చర్చల ప్రకారం మాయమైన 'నిధి'కి సంబంధించి నష్టపరిహారంగా రూ.10 లక్షలు ఇచ్చేందుకు ఇటుకబట్టీల వ్యాపారి ఒప్పుకున్నట్టు తెలుస్తోంది. అందులో భాగంగా 10 రోజుల క్రితం రూ.4 లక్షలు ముట్టజెప్పారని, మిగిలిన రూ. 6 లక్షలు ఈనెల 10న చెల్లిస్తానని హామీ ఇచ్చినట్టు సమాచారం. అయితే కోట్ల రూపాయల విలువైన నిధి విషయంలో కేవలం రూ.10 లక్షలకే రాజీ పడటంపై ముఠాలోని సభ్యుల మధ్య వాదోపవాదలు జరిగాయి. ఒకరిపై ఒకరికి అనుమానాలు పొడసూపాయి. దీంతో విషయం బటయకు పొక్కింది. ఈ ట్రెజర్ హంట్ ముఠాలో లక్ష్మీదేవిపల్లి మండలానికి చెందిన ఉప సర్పంచ్, క్రిమినల్ రికార్డ్ ఉన్న మరో వ్యక్తి కీలకంగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది.

భద్రగిరిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

- వేడుకగా చక్రస్నానం, ప్రత్యేక స్నపనం
- నేటి నుంచి నిత్యకల్యాణాలు పునఃప్రారంభం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో గత నెల 22న ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు బుధవారం బ్రహ్మాండంగా ముగిశాయి. చివరి రోజున స్వామివారి సుదర్శన చక్రానికి చక్రస్నానం వేడుకను కనులపండువగా జరిపారు. సుదర్శన చక్రాన్ని ప్రత్యేక పల్లకీలో మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ పవిత్ర గోదావరి నదీ తీరాన ఉన్న పునర్వసు మండపానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు స్వామివారి ఉత్సవమూర్తులకు మండపంలో స్నపన తిరుమంజనం చేసి హారతి సమర్పించారు. సాయంత్రం ధ్వజావరోహణం, దేవతోద్వాసన, ద్వాదశ ప్రదక్షిణలు, ద్వాదశారాధనలు నిర్వహించారు. యాగశాలలో పుష్పయాగం, పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. ఈ పూజల్లో ఏఈఓ శ్రవణ్‌కుమార్, ఆలయ స్థానాచార్యులు కేఈ స్థలశాయి, వేద పండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, ప్రధానార్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, విజయ రాఘవన్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి ఉత్సవమూర్తులను పునర్వసు మండపానికి తీసుకెళుతున్న అర్చకులు, భక్తులు

నేటి నుంచి దర్బార్ సేవలు..

నవాహ్నిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి నిత్యకల్యాణాలను నిలిపివేశారు. బుధవారం ఉత్సవాలు ముగియడంతో గురువారం నుంచి బేడా మండపంలో తిరిగి నిత్యకల్యాణం, దర్బార్ సేవలను యథావిధిగా జరపనున్నారు. ఈనెల 12న స్వామివారి నూతన పర్యంకోత్సవం నిర్వహించనున్నారు.

నేడు ఆలయ హుండీ లెక్కింపు..

రామాలయ హుండీని గురువారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్రకూట మండపంలో ఉదయం 8 గంటలకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

సుజాతనగర్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహించే జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 6, 8, 10, 11, 12, 13 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలో సుజాతనగర్ అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయగా, 70 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం పరీక్ష 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం పరీక్ష 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరగనుంది. కాగా ఉదయం పరీక్షకు 8 : 30 గంటల వరకు, మధ్యాహ్నం పరీక్షకు 2:30 వరకు మాత్రమే అనుమతిస్తామని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ట్రాన్స్‌పరెంట్ పెన్ను, అడ్మిట్ కార్డు, పాస్‌పోర్ట్, ఆధార్, రేషన్ కార్డుల్లో ఏదైనా ఒకటి తీసుకుని రావాలని సూచించారు.

ఓయూ నుంచి డాక్టరేట్



భీమనపల్లి కృష్ణ

ఇల్లెందు: ఇల్లెందు తెలంగాణ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, మధిరకు చెందిన భీమనపల్లి కృష్ణకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. ప్రొఫెసర్ లక్ష్మి పర్యవేక్షణలో 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం – తెలంగాణలో కూలీల ఆర్థిక విశ్లేషణ' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి గాను ఆయనకు బుధవారం డాక్టరేట్ ప్రకటించారు. కూలీ కుటుంబంలో జన్మించిన కృష్ణ ఓయూలో పీజీ పూర్తిచేశాక, కొన్నాళ్లు లెక్చరర్‌గా పనిచేయడమే కాక ఉపాధి హామీ పథకంలో కూడా విధులు నిర్వర్తించారు.

ముగిసిన యోగా శిబిరం



యోగా చేస్తున్న విద్యార్థినులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మూడురోజుల పాటు నిర్వహించిన మెగా యోగా మహోత్సవం బుధవారం ముగిసింది. శ్రీరామచంద్ర మిషన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినులకు 'హర్ దిల్ ధ్యాన్' పేరిట ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. యోగా శిక్షకురాలు పి.మాధురి ప్రాణాయామం, యోగముద్రలు, యోగాసనాలు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇలాంటి ఆసనాలు క్రమం తప్పకుండా వేస్తే ఒత్తిడి, ఊబకాయం, థైరాయిడ్ సమస్యలు తగ్గుతాయని చెప్పారు. ఎలా ధ్యానం చేయాలనే అంశంపై ఎన్.శివరాణి, ఆర్.రమాదేవి, శశికళ వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శారద, వ్యాయామ అధ్యాపకురాలు డాక్టర్ కె. సావిత్రి, ఆర్. కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలే శాపం..

- పంటలు దెబ్బతిన్న రైతులకు తీరని నష్టం
- అకాల వర్షాలకు 2,599 ఎకరాల్లో దెబ్బతిన్నట్టు ప్రాథమిక అంచనా
- పంటలు కోల్పోయిన వారందరికీ పరిహారం చెల్లించాలంటున్న అన్నదాతలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు పరిహారం పొందేందుకు ప్రభుత్వం విధించిన నిబంధనలు రైతుల పాలిట శాపంగా మారాయి. వేసిన పంటల్లో 33 శాతం మేర నష్టం జరిగితేనే పరిహారం అందజేయాలనే నిబంధనను ఎత్తివేయాలని రైతులు కోరుతున్నారు. పంట నష్టం జరిగితే ఎలాంటి నిబంధనలు లేకుండా పరిహారం అందజేయాలని రైతు సంఘాలు సైతం డిమాండ్ చేస్తున్నాయి. ప్రతి సంవత్సరం అతివృష్టి, అనావృష్టితో పంటలకు నష్టం వాటిల్లుతూనే ఉందని, లేనిపోని నిబంధనలతో తమకు అన్యాయం చేయొద్దని రైతులు అంటున్నారు.

అధికారుల సర్వే..

పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున చెల్లిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు పంట నష్టాలపై సమగ్ర సర్వే నిర్వహిస్తున్నారు. కలెక్టర్ అనుదీప్ సైతం పంట నష్టాలపై సమగ్ర నివేదికలు అందజేయాలని ఇప్పటికే పలు సమావేశాల్లో ఆదేశాలు జారీచేశారు. గత బుధవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆయన కూడా స్వయంగా పంటలను పరిశీలించారు. అయితే పంట నష్టం అధికంగానే ఉన్నప్పటికీ.. 33 శాతం నిబంధనతో జిల్లాలో బొప్పాయి, మామిడి, జీడిమామిడి, టమాట పంటలకు 145 ఎకరాల్లోనే నష్టం జరిగినట్టు ఉద్యాన శాఖాధికారులు తేల్చారు. బూర్గంపాడు, ఇల్లెందు, ఆళ్లపల్లి, అశ్వాపురం, సుజాతనగర్ మండలాల్లో 61 మంది రైతులకు రూ. 60 లక్షల మేర నష్టం వాటిల్లిందని వెల్లడించారు.

2,599 ఎకరాల్లో నష్టం..



కొమరారంలో సర్వే చేస్తున్న అధికారులు

వ్యవసాయ శాఖ నిర్వహించిన సర్వే ప్రకారం జిల్లాలో 2,599 ఎకరాల్లో వివిధ రకాల పంటలకు నష్టం జరిగిందని తేల్చారు. అయితే 33 శాతం నిబంధనలు వర్తింపజేస్తే ఎన్ని ఎకరాల్లో ఎంతమంది రైతులకు నష్టం జరిగిందనే విషయాన్ని పరిశీలిస్తున్నారు. ప్రధానంగా వరి, మొక్కజొన్న, పెసర, మినుము, పొగాకు, జొన్న పంటలకు నష్టం జరిగిందని సర్వేలో తేల్చారు. 45 మంది రైతులకు చెందిన 250 ఎకరాల్లో వరి, 1,352 మందికి సంబంధించి 2,181 ఎకరాల్లో మొక్కజొన్న, 10 మంది రైతులకు చెందిన 15 ఎకరాల్లో పెసర, ఐదుగురు రైతులకు సంబంధించి ఐదెకరాల్లో మినుము, 57 మంది రైతులకు చెందిన 145 ఎకరాల్లో పొగాకు, మూడెకరాల్లో జొన్న పంటలు నష్టపోయినట్టు అంచనా వేశారు.

నిబంధనల మేరకే పరిహారం



అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పరిహారం అందజేస్తాం. కలెక్టర్ ఆదేశాలతో సమగ్ర సర్వే నిర్వహిస్తున్నాం.

– కొర్సా అభిమన్యుడు, జిల్లా వ్యవసాయాధికారి

సర్వే జరుగుతోంది



ఉద్యాన పంటల నష్టంపై సమగ్ర సర్వే జరుగుతోంది. నిబంధనల మేరకు ఎకరానికి రూ.10వేల చొప్పున అందజేయడానికి కలెక్టర్ సూచన మేరకు పంట నష్టంపై నివేదికలు తయారు చేస్తున్నాం.– జినుగు మరియన్న, జిల్లా ఉద్యాన అధికారి

అందరికీ పరిహారం అందించాలి



అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎలాంటి నిబంధనలు విధించకుండా పరిహారం అందించాలి. ఎకరానికి రూ.10 వేలు ఇస్తామనడం కంటితుడుపు చర్యే. – కాసాని అయిలయ్య, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు

సామాజిక విప్లవ యోధుడు.. జగ్జీవన్

ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్

భద్రాచలం: సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన సామాజిక విప్లవ యోధుడు బాబూ జగ్జీవన్ రామ్ అని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. బుధవారం జగ్జీవన్ జయంతి సందర్భంగా ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం డేవిడ్ రాజ్ మాట్లాడుతూ.. స్వాతంత్రోద్యమంలో పాల్గొనడంతో పాటు ఆ తర్వాత కూడా ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. ఆలిండియా డిప్రెషన్ లీగ్ అనే సంస్థను స్థాపించి అంటరానితనాన్ని నిర్మూలించడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. నేటితరం యువకులు, విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఓఎఫ్‌ఆర్ డీటీ శ్రీనివాస్, మేనేజర్ ఆదినారాయణ, గిరిజన సంక్షేమ శాఖ పర్యవేక్షకురాలు ప్రమీలాబాయి,, సిబ్బంది మల్లికార్జున్, రాందాస్, రంగయ్య, వెంకటయ్య, సదానందం పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో..

భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పొదెం వీరయ్య జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సరెళ్ల నరేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతరేల రవికుమార్, నాయకులు శ్రీనివాసరెడ్డి, బలుసు నాగసతీష్, తిరుపతయ్య, సాయిబాబా, సరెళ్ల వెంకటేష్, సతీష్, పందాల సరిత, తుమ్మల రాణి, ఒంపోలు దేవకి, ఎస్‌కే హసీనా, ఎస్‌కే వసీమా, విజయ పాల్గొన్నారు.

పేపర్ లీకేజీ 'బండి' కుట్రే..

- విద్యార్థుల జీవితాలతో బీజేపీ నేతల చెలగాటం
- విప్ రేగా కాంతారావు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, విప్ రేగా కాంతారావు

మణుగూరుటౌన్: పేపర్ లీకేజీ కుట్రకు సూత్రధారి, పాత్రధారి బండి సంజయేనని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. బుధవారం ఆయన మణుగూరులోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. నిరుద్యోగులు, విద్యార్థుల జీవితాలతో బీజేపీ చెలగాటం ఆడుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసేందుకు బీజేపీ అగ్రనాయకులు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కేసీఆర్ చేస్తున్న అభివృద్ధితో దేశవ్యాప్తంగా బీఆర్‌ఎస్‌కు ఆదరణ పెరుగుతోందని, ఇది తట్టుకోలేక బీజేపీ నీచ రాజకీయాలు చేస్తోందని అన్నారు. విద్యార్థులను అడ్డు పెట్టుకొని లబ్ధి పొందాలనుకోవడం ప్రతిపక్షాల దివాళాకోరు తనానికి నిదర్శనమన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు తెలంగాణ ప్రజలకు సక్రమంగా అందేలా చూడాలని బీజేపీ నేతలకు హితవు పలికారు. సమావేశంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, ఎంపీపీ కారం విజయకుమారి, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ముత్యంబాబు, అడపా అప్పారావు, ప్రధాన కార్యదర్శి బొల్లిశెట్టి నవీన్‌బాబు, ప్రభుదాస్, కోఆప్షన్ సభ్యుడు జావేద్, నాయకులు తాళ్లపల్లి యాదగిరిగౌడ్, అక్కిరెడ్డి సంజీవరెడ్డి, కీసర శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారు..

- పేపర్ల లీకేజీ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే..
- డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య

అశ్వాపురం: విద్యార్థుల భవిష్యత్‌కు పునాది అయిన పదో తరగతి పరీక్ష పేపర్లు లీక్ చేస్తూ వారి జీవితాలతో బీఆర్‌ఎస్ సర్కారు ఆడుకుంటోందని డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగు, హిందీ పేపర్ల లీకేజీతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారని, ఎస్సెస్సీ బోర్డును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులైన పాలకులు, అధికారులపై చర్య తీసుకోవాలని అన్నారు. ఏడాది పాటు కష్టపడి చదివిన విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీని పక్కదోవ పట్టించేందుకే పదో తరగతి పరీక్ష పేపర్లు లీక్ చేస్తున్నారని, ఇది పాలకులు, అధికారుల ఎత్తుగడలో భాగమేనని ఆరోపించారు. ములుగు జిల్లాలో విద్యార్థులు రాసిన 11 బండిళ్ల పేపర్లకు పది మాత్రమే దొరికాయని, మరో బండిల్ ఎటు పోయిందో తెలియదని, దాని గురించి పట్టించుకున్న నాథుడే లేడని విమర్శించారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, పత్తి, మిర్చి, వరి, మామిడి, కూరగాయల తోటల నష్టంపై సర్వే కూడా చేయలేదన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు గాదె కేశవరెడ్డి, తూము వీరరాఘవులు, ఐలయ్య, వీరయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పొదెం వీరయ్య

క్లుప్తంగా

సీతమ్మ సాగర్ పనులు నిలిపివేయాలి

భద్రాచలంఅర్బన్: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం పర్యావరణ అనుమతులు వచ్చేవరకు సీతమ్మ సాగర్ పనులు నిలిపివేయాలని తెల్లం నరేష్, బూర లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు బుధవారం వారొక ప్రకటన చేశారు. ఎన్జీటీ ఆదేశాల ప్రకారం సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిపై కాంట్రాక్టర్ దాడి

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిపై ఓ కాంట్రాక్టర్ దాడి చేసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. క్షౌ రశాలకు చెందిన ఓ మహిళా కాంట్రాక్టర్‌కు ఔట్‌సోర్సింగ్ తాత్కాలిక ఉద్యోగి నడుమ సీఆర్‌ఓ కార్యాలయంలో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కాంట్రాక్టర్ చేయి చేసుకోవడంతో సదరు ఉద్యోగి ఆలయ ఈఓకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఆరు ట్రాక్టర్లు, జేసీబీ సీజ్

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామ శివారులో అటవీ ప్రాంతంలో సీతారామ ప్రాజెక్ట్ ప్యాకేజీ–2లో కెనాల్ మట్టి అక్రమంగా తరలిస్తుండగా మంగళవారం అర్ధరాత్రి ఆరు ట్రాక్టర్లు, జేసీబీని పోలీస్, సీతారామ ప్రాజెక్ట్ అధికారులు పట్టుకున్నారు. కొన్ని రోజులుగా సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ మట్టిని కొందరు ట్రాక్టర్ల యజమానులు అక్రమంగా మల్లెలమడుగు, మొండికుంట గ్రామాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామాల్లో ట్రాక్టర్ మట్టి రూ.400 నుంచి 500 వరకు విక్రయిస్తున్నారు. మంగళవారం రాత్రి మట్టి తోలకాలు జరుగుతున్నాయనే సమాచారంతో సీతారామ ప్రాజెక్ట్ డీఈ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఏఈలు గణేష్‌నాయక్, రాజీవ్‌గాంధీ, అశ్వాపురం సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు జితేందర్, సురేష్ నిఘా పెట్టి అర్ధరాత్రి సమయంలో వాహనాలను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఏఈ గణేష్‌నాయక్ ఫిర్యాదు మేరకు సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా సీతారామ కెనాల్ మట్టిని అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఈ శ్రీనివాస్ హెచ్చరించారు.

టేకు కలప స్వాధీనం



అటవీ అధికారులు పట్టుకున్న ఆటో

చుంచుపల్లి: కొత్తగూడెం పట్టణంలోని ఏ పవర్ హౌస్ బస్తీలో మంగళవారం రాత్రి ఆటోలో టేకు దిమ్మలు తరలిస్తుండగా గమనించిన స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఫారెస్ట్ అధికారులు అక్కడకు చేరుకొని ఆటోను పట్టుకుని కొత్తగూడెం అటవీ డివిజన్ కార్యాలయానికి తరలించారు. ఆరు టేకు దిమ్మలు స్వాధీనం చేసుకుని, నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు ఫారెస్ట్ డివిజనల్ అధికారి అప్పయ్య తెలిపారు.

20 కేజీల గంజాయి పట్టివేత

అశ్వాపురం: మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ వంతెన వద్ద అశ్వాపురం పోలీసులు బుధవారం 20 కేజీల గంజాయి పట్టుకున్నారు. వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన కారును ఆపి సోదా చేయగా, గంజాయి లభ్యమైంది. కారులో ఉన్న జగిత్యాలకు చెందిన కొండబత్తిని నిఖిల్, ప్రకాశం జిల్లాకు చెందిన పులిరామ్‌బాబును అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్నట్లు తేలింది. దీంతో ఇద్దరిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామని, పట్టుబడ్డ గంజాయి విలువ రూ.4,06,000 ఉంటుందని పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కొత్తగూడెంరూరల్: ఆటోలో తరలిస్తున్న మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్ బుధవారం తెలిపారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఇల్లెందు క్రాస్ రోడ్డు నుంచి తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేశామని, ఆటోను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

వేధింపుల కేసు నమోదు

దమ్మపేట: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్త, అతని కుటుంబీకులపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని కృష్ణా జిల్లా విస్సన్నపేట మండలం రామచంద్రాపురంలోని కలగర గ్రామానికి చెందిన వర్రా నాగ మల్లేశ్వరరావుతో దమ్మపేట గ్రామానికి చెందిన శ్రీలక్ష్మికి పదేళ్ల క్రితం వివాహం జరిగింది. శ్రీలక్ష్మికి సంతానం లేకపోవడంతో కొంత కాలంగా భర్త, అతని కుటుంబ సభ్యులు వేధిస్తున్నారు. టెస్ట్ ట్యూబ్ బేబి కోసం రూ. 5 లక్షలు పుట్టింటి నుంచి తేవాలని ఒత్తిడి చేస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.13,781



పాల్వంచ రూరల్: పట్టణంలోని వెంగళరావు కాలనీలో విరిగిపడ్డ విద్యుత్ స్తంభం



గుండాల: విరిగిపడిన విద్యుత్ స్తంభం



పాల్వంచ రూరల్: బొల్లోరిగూడెంలో లేచిపోయిన ఇంటి పైకప్పు రేకులు

కూలిన చెట్లు.. విరిగిన విద్యుత్ స్తంభాలు

- వలుచోట్ల గాలివాన బీభత్సం
- పిడుగుపాటుకు పశువుల మృత్యువాత
- ఆళ్లపల్లిలో ఉప్పొంగిన వాగులు
- మామిడి, మిర్చి తోటలకు మళ్లీ దెబ్బ..



గుండాల: ఆళ్లపల్లిలో ఉధృతంగా ప్రవహిస్తున్న జల్లేరు

పాల్వంచరూరల్: జిల్లాలో బుధవారం సాయంత్రం పలుచోట్ల గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. స్తంభాలు విరిగి విద్యుత్ సరఫరాకు, చెట్లు కూలి రాకపోకలకు అంతరాయం కలిగింది. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో వాగులు ఉప్పొంగాయి. మండల పరిధిలోని సూరారం, పాండురంగాపురం, పునుకుల, పుల్లాయిగూడెం, కోడిపుంజులవాగు, లక్ష్మీదేవిపల్లి, బస్వతారాకకాలనీ తదితర గ్రామాల్లో మామిడికాయలు, మిర్చి నేలరాలిపోయాయి. సూరారంలో చెట్లు నేలకూలాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. కేటీపీఎస్ యాష్ పాండ్ నుంచి బూడిద గాలిలోకి లేచి కమ్మేసింది. దీంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

పాల్వంచ పట్టణంలో..

బలమైన గాలులకు పట్టణంలోని బొల్లోరిగూడెంలో ఇళ్లపైకప్పులు ఎగిరిపోయాయి. వెంగళరావుకాలనీతోపాటు పలు ప్రాంతాల్లో విద్యుత్‌స్తంభాలు విరిగిపడ్డాయి. వైర్లు తెగిపడ్డాయి. చెట్లు నేలకూలాయి. అల్లూరి సెంటర్‌లో కేటీపీఎస్ ప్రహరీ కూలి ఓ ఇంటిపై పడింది. అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. పలు వీధుల్లో హోర్డింగులు కూలిపడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్రఇబ్బందులు పడ్డారు.

గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో..

గుండాల: ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో బుధవారం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. పిడుగుపాటుతో ఆళ్లపల్లి మండలం సుద్దరేవులో 3, కిచ్చేనపల్లి గ్రామంలో



పాల్వంచ రూరల్: అల్లూరి సెంటర్‌లో కూలిన కేటీపీఎస్ ప్రహరీ వద్ద సహాయక చర్యలు..



గుండాల: పిడుగుపాటుతో మృతి చెందిన పశువు వద్ద రైతు

ఐదు దుక్కిటెడ్లు మృతి చెందాయి. విద్యుత్ స్తంభాలు విరిగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గుండాల మండలంలో ఓ మోస్తరు వర్షం కురవగా, ఆళ్లపల్లి మండలంలో భారీ వర్షం కురిసింది. నడిమిగూడెం గ్రామంలో జబ్బ పోతయ్య, తాటి ప్రభాకర్, కల్తి రామస్వామి చెందిన రైతుల ఇళ్లపై రేకులు లేచిపోయాయి. అక్కడక్కడా మొక్కజొన్న చేన్లు పడిపోయాయి. మామిడి కాయలు సైతం నేలరాలాయి. ఆళ్లపల్లి మండలం పాతూరు గ్రామానికి చెందిన గొగ్గెల వసంతరావు చేలో ఆరబోసిన 30 క్వింటాళ్ల మక్కలు తడిసిపోయాయి. వరద నీటితో కిన్నెరసాని, జల్లేరువాగు ఉప్పొంగాయి.

ఎద్దు మృతి

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం సూర్య తండాలో అజ్మీర మురళి అనే రైతుకు చెందిన ఎద్దు పిడుగుపాటుతో మృతి చెందింది. రూ. 80 వేలు నష్టపోయినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

మరో అవకాశం కల్పించాలి..



సింగరేణి ప్రధానాస్పత్రి ముఖద్వారం

సింగరేణి(కొత్తగూడెం): మెడికల్ ఇన్‌వాలిడేషన్ పక్రియలో భాగంగా మెడికల్ బోర్డ్‌లో ఇన్‌వాలిడేషన్‌కానీ కార్మికులకు మూడు నెలల్లో మరో అవకాశం కల్పించాలని కార్మికులు కోరుతున్నారు. దీంతో లెఫ్ట్ ఓవర్ సర్వీసు 24 మాసాల కంటే తక్కువ అవుతుందని, మెడికల్ ఇన్‌వాలిడేషన్ దరఖాస్తుకు (24 మాసాలు) సమయం లేక అనర్హులుగా కంపెనీ ప్రకటిస్తున్న నేపథ్యంలో ఇన్‌వాలిడేషన్ కానీ కార్మికులకు యాజమాన్యం మూడు మాసాల్లో అవకాశం కల్పించాలని వేలాది కార్మిక కుటుంబాలు కోరుతున్నాయి. సంస్థలో పనిచేసే కార్మికులు వారి ఆరోగ్య పరిస్థితి సరిగ్గా లేని కార్మికుల పిల్లలకు ఉపాధి (డిపెండెంట్ జాబ్) కల్పించటానికి సదరు కార్మికుడు మెడికల్‌బోర్డులో ఇన్‌వాలిడేషన్ (అన్‌ఫిట్) కావాల్సి ఉంది. అయితే, ఈ బోర్డుకు దరఖాస్తు చేసుకోవాలంటే కార్మికుడికి 24 మాసాల సర్వీసు కచ్చితంగా ఉండాలని నిబంధనలున్నాయి. మెడికల్‌బోర్డ్‌లో కొంతమందిని మాత్రమే అన్‌ఫిట్ చేసి వారి పిల్లలకు ఉద్యోగం కల్పిస్తున్నారు. అన్‌ఫిట్ కాని మిగతావారి పిల్లలకు అవకాశం లేకుండా పోతోంది. ఈ క్రమంలో అనేక మంది కార్మికుల పిల్లలు ఉద్యోగాలు లేక ఇబ్బందిపడుతున్నారు. ఒకసారి మెడికల్‌బోర్డ్‌లో ఇన్‌వాలిడేషన్ కాని వారికి మరో సంవత్సరం వరకు అవకాశం కల్పించటం లేదు. అనేక మంది కార్మికుల పిల్లలకు ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో ఇన్‌వాలిడేషన్ కానీ కార్మికులకు మూడు మాసాల్లో మెడికల్‌బోర్డ్‌కు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అందని ఫలితం..

రాష్ట్ర ముఖ్యమంత్రి మెడికల్‌బోర్డ్‌లో గతంలో ఉన్న 6 జబ్బులకు మరో 10 జబ్బులను కలిపి మొత్తం 16 జబ్బులకు అవకాశం కల్పించారు. కానీ, సింగరేణి మెడికల్ బోర్డ్ అధికారులు ఏ ప్రమాణికాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నారో తెలియదు కానీ, పలు జబ్బులున్నవారు మాత్రం మెడికల్ ఇన్‌వాలిడేషన్ అవడం లేదు. కానీ ఏ జబ్బులు లేనివారు కొందరు అన్‌ఫిట్ అవుతున్నారు. జబ్బులుండి ఇబ్బంది పడేవారు, రెండు, మూడు స్టంట్‌లు పడినవారు, కళ్లు కనిపించనివారు. నడవలేక ఇబ్బంది పడే వారు మాత్రం అన్‌ఫిట్ కావటం లేదని కార్మికుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అవకాశం కల్పించాలి..



మెడికల్‌బోర్డ్‌కు హాజరై ఒకసారి ఇన్‌వాలిడేషన్ కానీ కార్మికులకు 100 రోజుల్లో మరో అవకాశం కల్పించాలి. హయ్యర్ రిఫరల్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి, సింగరేణి స్పెషలిస్ట్ డాక్టర్ల సూచనతోనే కార్మికులను ఇన్‌వాలిడేసన్ చేయాలి. హయ్యర్ రిఫరల్‌లో దందా నడుస్తోంది. దీనిలో చాలామందికి వాటాలున్నాయి. కార్మికులు మాత్రం ఇబ్బందులకు గురవుతున్నారు.

– రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ నేత

ఫ్యాన్ తెచ్చుకోవాల్సిందే !







వేసవి కాలం వచ్చేసింది. నానాటికీ ఉక్కపోత పెరుగుతోంది. ఇళ్లలో అయితే ఎలాగోలా ఇక్కట్లు అధిగమిస్తాం. కానీ ఖమ్మం జిల్లా ప్రధాన ఆస్పత్రిలోని మాతాశిశు కేంద్రం(ఎంసీహెచ్)లోని బాలింతల ఇబ్బందులు చెప్పనలవి కాకుండా ఉన్నాయి. ఎంసీహెచ్ రెండో అంతస్తులో ఉండగా.. వేడి ఎక్కువగా, ఫ్యాన్లు తక్కువగా ఉండడంతో బాలింతలు ఉక్కపోతతో అవస్థ పడుతున్నారు. దీంతో గర్భిణులను ప్రసవానికి తీసుకొచ్చేటప్పుడు వారి కుటుంబ సభ్యులు టేబుల్ ఫ్యాన్ కూడా వెంట తీసుకొస్తున్నారు. ఫలితంగా ప్రతీ బాలింత బెడ్ వద్ద టేబుల్ ఫ్యాన్లు కనిపిస్తున్నాయి. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

మావోయిస్టు మిలీషియా సభ్యుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్

భద్రాచలంఅర్బన్: ఇద్దరు మావోయిస్టు మిలీషియా సభ్యులను చర్ల పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. ఈ మేరకు బుధవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ కథనం ప్రకారం... ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పామేడు మండలం జారపల్లి గ్రామానికి చెందిన సోడి దూల మిలీషియా సభ్యుడిగా, సోడి సన్నా మిలీషియా డిప్యూటీ కమాండర్‌గా పనిచేస్తున్నారు. మావోయిస్టు పార్టీ నాయకుల ఆదేశాలతో పోలీసులను చంపాలనే ఉద్దేశంతో ఇతర మిలీషియా సభ్యులతో కలిసి చర్ల మండలం గోరుగొండ అటవీ ప్రాంతంలో ప్రెజర్ బాంబు ఏర్పాటు చేసేందుకు పేలుడు పదార్థాలతో వచ్చారు. అదే సమయంలో కూంబింగ్ చేస్తున్న పోలీసులు వారిని గమనించి అదుపులోకి తీసుకున్నారు. విచారించగా మూడేళ్లుగా మావోయిస్టు మిలీషియాలో పనిచేస్తున్నట్లు అంగీకరించారు. గతేడాది జూన్‌లో చర్ల మండలం గోరుగొండ అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన ట్రెంచ్ పనుల్లో చేపడుతున్న పొక్లెయినర్‌ను తగులబెట్టి, జేసీబీ, బైక్‌ను అపహరించిన ఘటనలో వీరు పాల్గొన్నట్లు విచారణలో తేలింది. నిందితులను అరెస్ట్ చేసి, ఒక ఎలక్ట్రిక్ డిటోనేటర్, 2జిలెటిన్ స్టిక్స్, కార్డెక్స్ వైర్, సిరంజీలు, స్టీల్ టిఫిన్ బాక్స్, బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు.

ఆశ్రమ పాఠశాలల్లో డీడీ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ రమాదేవి

దమ్మపేట: మండలంలోని పలు గిరిజన ఆశ్రమ పాఠశాలలను భద్రాచలం ఐటీడీఏ డీడీ రమాదేవి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుర్గం గొల్లగూడెం, పార్కలగండి, అంకంపాలెం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసిన ఆమె పదో తరగతి విద్యార్థులతో సమావేశమై పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా సూచనలిచ్చారు. అలాగే, విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ధర్మ, వార్డెన్ నాగమణి, ఉపాధ్యాయులు జ్యోతి, రజిని, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి

- చెట్లు నరుకుతుండగా తేనెటీగలు కుట్టడంతో ఘటన
- మృతదేహంతో సబ్‌స్టేషన్ వద్ద బంధువుల ఆందోళన



మృతి చెందిన గంగులు

అశ్వాపురం: విద్యుత్ సబ్ స్టేషన్‌లో హెల్పర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తి లైన్‌కు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు నరుకుతుండగా ఒక్కసారిగా లేచిన తేనెటీగలు కుట్టడంతో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. అశ్వాపురం మండలం మల్లెలమడుగులో బుధవారం విద్యుత్ శాఖ అధికారులు లైన్‌కు ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలు నరికివేయిస్తున్నారు. ఈక్రమంలోనే సబ్‌స్టేషన్ హెల్పర్, ఇదే గ్రామానికి చెందిన గొడ్ల గంగులు(43) ఓ చెట్టు నరికేందుకు ఎక్కగా తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో గంగులు చెట్టు దిగి నడవలేని స్థితిలో కుంటుతూ ఇంటికి వెళ్లాక స్పృహ తప్పి పడిపోయాడు. ఈమేరకు కుటుంబసభ్యులు మొండికుంటలోని ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లి ఆయన సూచనలతో భద్రాచలం ఆస్పత్రికి తరలించగా గంగులు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



ఒప్పంద పత్రంతోపాటు రూ.50 వేల పరిహారం అందజేస్తున్న అధికారులు

కాగా, ఇరవై ఏళ్లుగా హెల్పర్‌గా పనిచేస్తున్న గంగులు కుటుంబానికి న్యాయం చేయాలనే డిమాండ్‌తో ఆయన మృతదేహంతో సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. సర్పంచ్‌లు కోడి కృష్ణవేణి, మర్రి మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు, యూనియన్ నేతలు సంఘీభావం తెలిపి మాట్లాడుతూ గంగులు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ అధికారులతో చర్చలు జరిపారు. రూ.4.50 లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి సంస్థలో ఖాళీలు భర్తీ చేసినప్పుడు ఉద్యోగం ఇచ్చేందుకు ప్రాధాన్యమిచ్చేందుకు విద్యుత్ శాఖ అధికారులు అంగీకరించి ఒప్పందం రాసి ఇచ్చారు. బుధవారం రూ.50 వేలు మృతుడి కుటుంబానికి అందజేశారు. మిగతా పరిహారం త్వరలోనే అందజేస్తామని అధికారులు తెలిపారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

పాల్వంచరూరల్: ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గత నెల 31న మండల పరిధిలోని ఆర్టీఏ చెక్‌పోస్టు సమీపంలో బైక్‌ను బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న బూర్గంపాడు మండలం నకిరిపేట గ్రామానికి చెందిన ధర్మసోతు శ్రీను, తేజావత్ శివలకు గాయాలయ్యాయి. బాధితుడు శివ ఫిర్యాదు మేరకు ఖమ్మానికి చెందిన బొలెరో వాహనం డ్రైవర్ సరికొండ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

రాజకీయ క్రీడగా మారిన పేపర్ లీకేజీలు

- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: నేటి పదో తరగతి ప్రశ్న పత్రాలు, మొన్నటి టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రాలు లీకేజీ బీజేపీ, బీఆర్‌ఎస్ నడుమ రాజకీయ క్రీడగా మారి.. లక్షలాది మంది విద్యార్థుల, నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమైపోయిందని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో విమర్శించారు. లీకేజీలకు ప్రధాన సూత్రధారులు, పాత్రధారులెవరో నిగ్గు తేల్చడానికి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తీవ్రమైన సమస్యను పక్కదారి పట్టించి.. రాజకీయ క్రీడగా, బీఆర్‌ఎస్, బీజేపీల మధ్య పోరాటంగా మార్చడం శోచనీయమని పేర్కొన్నారు. బండి సంజయ్ రాజకీయ క్రీడ, రాజకీయ అవకాశవాదం, ఈ లీకేజీల వ్యవహారాన్ని రక్తికట్టించిందని మండిపడ్డారు. ఆయా ఘటనల్లో అసలు సూత్రధారులెవరో అర్థం కాకుండా చేయడానికి ప్రభుత్వం, బీజేపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జిల్లాకు చేరిన యూపీ యువకుడి యాత్ర



సనోజ్‌ను సన్మానిస్తున్న సుజాతనగర్ వాసులు

సుజాతనగర్: దేశ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకునేందుకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కృషినగర్ జిల్లా గరంపూర్‌బాత్ గ్రామానికి చెందిన 23 ఏళ్ల యువకుడు రోవింగ్ సనోజ్ చేపట్టిన పాదయాత్ర బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలానికి చేరుకుంది. జాతీయ పతాకం చేబూని యాత్ర చేపడుతున్న ఆయనను సుజాతనగర్‌లో పలువురు సన్మానించారు. ఈ సందర్భంగా సనోజ్ మాట్లాడుతూ నిరుపేద వ్యవసాయ కుటుంబానికి చెందిన తాను పెట్రో కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేయగా, ఉద్యోగాన్ని వదులుకుని పాదయాత్ర చేపట్టానని తెలిపారు. గత ఏడాది అక్టోబర్ 21న అరుణాచల్‌ప్రదేశ్‌లో మొదలైన యాత్ర ఇప్పటి వరకు పది రాష్ట్రాల పరిధిలో 4,200 కి.మీ మేర పూర్తయిందని వివరించారు.

రామాలయానికి సమీపంలో పందుల కళేబరాలు

టెంపుల్ సిటీలో అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యం







డంపింగ్ యార్డు వద్ద పందుల కళేబరాలు

భద్రాచలం: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం, పవిత్ర గోదావరి నదికి కూతవేటు దూరంలో పందుల కళేబరాలు కనిపిస్తున్నాయి. నిత్యం వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే ప్రాంతంతోపాటు జనావాసాల్లో ఉన్న ఈ దృశ్యాలు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం భద్రాచలంలో అంతుచిక్కని వ్యాధితో పందులు మృత్యువాత పడ్డాయి. దీంతో పందుల పెంపకందారుల సమాచారంతో గ్రామ పంచాయతీ అధికారులు పందుల కళేబరాలను ట్రాక్టర్లలో తరలించి డంపింగ్ యార్డు వద్ద పడవేసి చేతులు దులుపుకున్నారు. గోతులు తీసి పూడ్చిపెట్టాల్సి ఉండగా, గ్రామపంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి బహిరంగంగా పడవేశారు. దీనిపైనే పట్టణంలోని చెత్తా చెదారం సైతం వేస్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. చుట్టుపక్కల ఉండే ప్రజలు పంచాయతీ అధికారులకు మళ్లీ ఫిర్యాదు చేయటంతో కేవలం బ్లీచింగ్ చల్లి మిన్నకుండిపోయారు. గోదావరికి వెళ్లే ప్రాంతం, ప్రజలు ఆవాసం ఉండే కాలనీలకు దగ్గరగా ఉండే ప్రాంతం కావడంతో కలరాతో పాటు ఇతర వ్యాధులు వ్యాప్తి చెందుతాయేమోనని భక్తులు, కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. 'క్లీన్ భద్రాద్రి'గా మారుస్తామంటూ ప్రకటనలకే పరిమితవుతున్న గ్రామ పంచాయతీ అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా...

పిడుగుపాటుకు ఎనిమిది పశువులు మృతి



గుండాల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పిడుగులు పడడంతో ఆళ్లపల్లి మండలం సుద్దరేవు గ్రామంలో మూడు ఆవులు, కిచ్చెనపల్లిలో నాలుగు ఆవులు, ఒక దుక్కిటెద్దు మృత్యువాతపడ్డాయి. మధ్యాహ్నం మేతకు వెళ్లిన పశువులు.. వర్షం కురుస్తుండటంతో చెట్ల కిందకు వెళ్లాయి. ఆ సమయంలో పిడుగులు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. పశువుల మృతితో రైతులు లబోదిబోమంటున్నారు. భారీ వర్షంతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదలతో ఆళ్లపల్లి మండలం జల్లేరు, గుండాల మండలం కిన్నెరసాని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జిల్లాలోని పాల్వంచ, కొత్తగూడెం, గుండాల తదితర మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పలు ఇళ్ల పైకప్పు రేకులు లేచిపోగా, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

ఆంధ్ర ధాన్యం రాకుండా చెక్‌పోస్టు



మిర్యాలగూడ: ఆంధ్ర నుంచి ధాన్యం రాకుండా అడ్డుకునేందుకు జిల్లా యంత్రాంగం చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దుగా ఉన్న నల్లగొండ జిల్లా వాడపల్లి వంతెన వద్ద కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశానుసారం అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, డీఎస్‌వో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. చెక్‌పోస్టును బుధవారం తహసీల్దార్ గణేష్, ఎస్‌ఐ రవికుమార్, డీటీ ఖాదర్ లు ప్రారంభించారు. చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహించేందుకు రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్, మార్కెటింగ్ శాఖల అధికారులతో మూడు బృందాలను నియమించారు. షిఫ్టులవారీగా ఈ బృందాలు విధులు నిర్వహించనున్నాయి. ఈ సందర్భంగా సివిల్ సప్లయ్ డీటీ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రైతులకు మేలు చేకూర్చడానికి ఆంధ్ర నుంచి ధాన్యం వాహనాల రాకను అడ్డుకునేందుకు ప్రతి సీజన్‌లో మాదిరిగానే ప్రస్తుతం కూడా వాడపల్లి వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం

- భక్తులతో కిటకిటలాడిన ఒంటిమిట్ట



మాంగల్యాన్ని చూపుతున్న వేదపండితులు

సాక్షి ప్రతినిధి, కడప/ఒంటిమిట్ట: సాక్షి ప్రతినిధి, కడప/ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో వైభవంగా జరుగుతున్న శ్రీకోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి సీతారాముల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. పున్నమి వెన్నెల్లో జరిగిన ఈ కల్యాణాన్ని వేలాదిమంది భక్తులు కనులారా తిలకించి తరించారు. శ్రీసీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన వేలాదిమంది భక్తులకు శ్రీవారి సేవకులు ముత్యంతో కూడిన తలంబ్రాలను పంపిణీ చేశారు. అంతకుముందు శ్రీసీతారాముల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ శోభాయాత్రగా ఆలయం నుంచి కల్యాణవేదికకు తీసుకొచ్చారు. శ్రీకోదండరాముడి కల్యాణం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, కొట్టు సత్యనారాయణ దంపతులు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.

ప్రాణం తీసిన యువకుడి వేధింపులు

జగిత్యాలలో ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం



ఆత్మహత్య చేసుకున్న ప్రియాంక

జగిత్యాలక్రైం: యువకుడి వేధింపులు ఓ యువతి ప్రాణాలు తీశాయి. పెళ్లి చేసుకోవాలని వెంటపడుతుండటంతో తట్టుకోలేక ఇంటర్మీడియట్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద ఘటన జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ వీధికి చెందిన మ్యాన రాజశేఖర్–జయశ్రీ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె ప్రియాంక (17) జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వారి వీధికే చెందిన యువకుడు చేని సంపత్ ఉరఫ్ ఓంకార్... ప్రేమిస్తున్నానంటూ చాలాకాలంగా బాలిక వెంటపడుతున్నాడు. తనను పెళ్లి చేసుకోవాలని నిత్యం వేధిస్తున్నాడు. భరించలేక కుటుంబసభ్యులు గతేడాది డిసెంబర్ 19న పోలీసులను ఆశ్రయించారు. దీంతో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంపత్‌పై పోక్సో కేసు నమోదు చేసి జైలుకు పంపారు. తర్వాత బెయిల్‌పై విడుదలైన సంపత్ తన పద్ధతి మార్చుకోలేదు. తనను ప్రేమించాలంటూ నిత్యం ప్రియాంక వెంట పడుతూనే ఉన్నాడు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక.. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్‌రూంలోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆ తర్వాత ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు.. అప్పటికే ప్రియాంక మృతి చెందినట్లు నిర్ధారించారు. తండ్రి రాజశేఖర్ ఫిర్యాదు మేరకు సంపత్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కిశోర్ తెలిపారు.

గురుకులంలో విద్యార్థిని ప్రసవం

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన • ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ వేటు



నారాయణఖేడ్: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లోని గురుకుల కళాశాల విద్యార్థిని (16) ఓ శిశువుకు జన్మనిచ్చింది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. గతనెల 24న సిర్గాపూర్ మండల పరిషత్ కార్యాలయం సమీపంలోని ముళ్లపొదల్లో ఓ శిశువును గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆ పసికందుకు ఆస్పత్రిలో చికిత్స చేయించి సంగారెడ్డిలోని బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ముళ్ల పొదల్లో దొరికిన ఆ శిశువు గురుకుల కళాశాలలో విద్యార్థినికి జన్మించిన శిశువుగా ప్రాథమికంగా నిర్ధారణ అయినట్టు తెలుస్తోంది. కళాశాల ప్రిన్సిపాల్ డి.మంజుల బుధవారం మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు. తమ కళాశాలలో వసతి పొందుతున్న ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థిని గర్భం దాల్చిందని, గత నెల 24న తెల్లవారు జామున 3.20 గంటలకు బాత్‌రూంలో ఆడ శిశువుకు జన్మనిచ్చిందని తెలిపారు. దీంతో ఆ శిశువుతో పాటు విద్యార్థినిని తల్లిదండ్రులకు అప్పగించినట్టు చెప్పారు.

ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ వేటు

ఈ ఘటనపై అంతర్గతంగా విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు.. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల ప్రిన్సిపాల్ మంజులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఔట్ సోర్సింగ్‌పై పనిచేస్తున్న డిప్యూటీ వార్డెన్ నజీమా బేగం, స్టాఫ్ నర్సు ఎం.సునీతలను విధుల్లోంచి తొలగించారు. రెండు రోజుల్లో ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించే అవకాశాలు ఉన్నాయని పోలీసువర్గాలు తెలిపాయి.

సిబ్బంది నిర్లక్ష్యం..?: గురుకులంలో వసతి పొందుతూ చదువుకుంటున్న విద్యార్థిని గర్భం దాల్చిన ఘటనలో గురుకుల కళాశాల అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలు వస్తున్నాయి. ఆ విద్యార్థిని మానసికంగా, భౌతికంగా దృఢంగా ఉండటంతో ఎవరికీ అనుమానం రాలేదని ప్రిన్సిపాల్ మంజుల తెలిపారు. తర్వాత ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రసవం తర్వాత విద్యార్థినిని, శిశువును తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. తర్వాత వారు శిశువును పొదల్లో వదిలేసినట్టు బయటపడిందని మంజుల పేర్కొన్నారు.

బాలికపై నలుగురు యువకుల లైంగికదాడి

- గర్భం దాల్చడంతో కప్పిపుచ్చే యత్నం
- నిందితులపై పోక్సో కేసు నమోదు

పెంబి: నిర్మల్ జిల్లా పెంబి మండలం పుల్గంపాండ్రి గ్రామానికి చెందిన బాలిక (17)పై నలుగురు యువకులు లైంగికదాడి చేశారు. బాలిక గర్భం దాల్చడంతో కప్పిపుచ్చే ప్రయత్నంలో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. పుల్గంపాండ్రి గ్రామానికి చెందిన బాలిక కుటుంబ సభ్యులు కొన్ని రోజులుగా జీవనోపాధి కోసం హరిచంద్‌తండా గ్రామానికి వెళ్లి కూలీ పని చేసుకుంటున్నారు. బాలిక మేకల కాపరిగా పనిచేస్తోంది. హరిచంద్‌తండా గ్రామ పంచాయతీ పరిధి తులసీపేట్‌కు చెందిన నలుగురు యువకులు ఆమెను బెదిరించి ఏడు నెలలుగా పలుమార్లు అత్యాచారం చేశారు. కాగా, బాలిక గర్భం దాల్చడాన్ని గమనించిన నలుగురు యువకుల్లో ఒకరు మంగళవారం సాయంత్రం గర్భస్రావానికి సంబంధించిన మాత్రలు ఇవ్వడంతో వేసుకుంది. కొన్ని గంటలకు నొప్పులు రావడంతో మృతశిశువుకు జన్మనిచ్చింది. బాలిక తల్లిదండ్రులు ఆరా తీయగా విషయం చెప్పింది. దీంతో బాలిక తండ్రి పెంబి పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. నిందితులు నలుగురిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు.

ఇసుక లారీలు వద్దన్నందుకు | మమ్మల్ని బహిష్కరించారు

- రామన్నపేట్ ముదిరాజ్‌ల ఆరోపణ
- జిల్లా మంత్రి ఆదుకోవాలని వేడుకోలు



విలేకరులతో మాట్లాడుతున్న రామన్న పేట్ ముదిరాజ్‌ల సంఘ సభ్యులు

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం రామన్న పేట్ గ్రామంలోని కుంట కింది సంఘం, గడ్డం సంఘం, బొమ్మ సంఘం, ఈర్ల ముదిరాజ్ సంఘాల సభ్యులు 300 మందిని గ్రామ అభివృద్ధి కమిటీ(వీడీసీ) సాంఘిక బహిష్కరణ చేయడం వివాదాస్పదంగా మారింది. బుధవారం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో బాధిత సంఘాలకు చెందిన సభ్యులు లింబాద్రి, రుక్మిణి మాట్లాడుతూ.. ఇందుకు సంబంధించిన పూర్వాపరాలను వివరించారు. ''రామన్నపేట గ్రామంలోని కప్పల వాగు నుంచి సంగేమ్ కిషన్ అనే వ్యక్తి ఇసుకను అక్రమంగా భారీ వాహనాలతో తరలిస్తున్నారు. మేము రాత్రిళ్ళు పంట పొలాలు, తోటల్లోని కరెంటు మోటార్ల దగ్గరికి వెళ్లి వస్తుండగా భారీ వాహనాలు పైకి వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముదిరాజ్‌లు నివసించే గల్లీలో నుంచి ఇసుకను తరలించవద్దని వీడీసీ సభ్యులకు విన్నవించాం. అంతే.. మా కులస్తులను గ్రామ బహిష్కరణ చేశారు..'' అని చెప్పారు. గ్రామంలోని కిరాణా షాప్‌లలో నిత్యావసర వస్తువులు కొనుక్కోనివ్వడం లేదని, కిరాయి ఇళ్ల నుంచి ఒకటో తేదీ నాటికి ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులను స్కూల్‌కు పంపిస్తే అక్కడ ఇతర కులస్తుల విద్యార్థులతో మాట్లాడనివ్వడం లేదని, ఆడుకోనివ్వడం లేదన్నారు. ఎవరైనా మాతోమాట్లాడినా, బైకుల పైన వెళ్లినా రూ.లక్ష జరిమానా అంటూ భయపెడుతున్నారని తెలిపారు. కలెక్టర్, పోలీసులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు.

కేటాయింపులకు మించి వాడకం

కుడి కాల్వకు నీటి నిలిపివేత



నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ జలాశయంలో కేటాయింపులకు మించి నీటి వాడకం జరిగింది. కృష్ణా నదీ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్‌ఎంబీ) సాగర్ కుడి, ఎడమ కాల్వలకు వానాకాలం, యాసంగి పంటలకు 132 టీఎంసీల చొప్పున నీటిని కేటాయించింది. అయితే కుడి కాల్వ కింద 198.8 టీఎంసీల నీటిని వాడుకోగా, ఎడమ క్వాల కింద ఇప్పటి వరకు 139 టీఎంసీల నీటి వినియోగం జరిగింది. కుడి కాల్వకు ఈ ఏడాది కేటాయించిన నీటికంటే ఎక్కువగా వినియోగిస్తున్న విషయంలో పలుమార్లు కృష్ణానది యాజమాన్య బోర్డు.. నీటిని నిలిపివేయాలని సంబంధిత అధికారులకు ఉత్తర్వులిచ్చినా పట్టించుకోలేదని విమర్శలు ఉన్నాయి. ఎట్టకేలకు ఈనెల 1వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు నీటిని నిలిపివేశారు. ప్రస్తుతం సాగర్ జలాశయం కనీస నీటిమట్టానికి చేరువలో ఉంది. గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.50 టీఎంసీలు) కాగా.. ప్రస్తుత నీటిమట్టం 528.60 అడుగులు (165.4274టీఎంసీలు)గా ఉంది. కనీస నీటిమట్టం 510 అడుగులు (131.6690 టీఎంసీలు) కావడంతో.. డెడ్ స్టోరేజీకి పైన కేవలం 33.7584 టీఎంసీల నీటిని మాత్రమే వినియోగించుకునేందుకు అవకాశం ఉంది. ఎడమకాల్వ కింద అవసరాలకు మరో 15 రోజుల పాటు ఈ నీటినే విడుదల చేయాల్సి ఉంటుంది. హైదరాబాద్‌తో పాటు గ్రామీణ ప్రాంతాలు, పలు పట్టణాలకు తాగునీటిని అందించాల్సి ఉంటుంది. జలాశయంలోకి కొత్తనీరు వచ్చే వరకు తాగునీటి అవసరాలకు ఈ నీరు సరిపోవడం అనుమానంగానే కనిపిస్తోందని ఇంజనీరింగ్ నిపుణులు అంటున్నారు.

'మార్గదర్శి' కేసులో ఏ–2 శైలజ విచారణ నేడు

▶ మొదటి పేజీ తరువాయి

రామోజీరావే నిధుల మళ్లింపు నిజమేనని దాదాపుగా అంగీకరించడంతో ఈ కేసులో సీఐడీ కీలక పురోగతి సాధించినట్లయింది. ఈ నేపథ్యంలోనే ఈ కేసులో ఏ–2గా ఉన్న చెరుకూరి శైలజ కిరణ్‌ను గురువారం విచారించనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. శైలజను హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆమె నివాసంలోనే విచారించనున్నారు. రామోజీరావు, శైలజ స్టేట్‌మెంట్లను విశ్లేషించిన అనంతరం ఈ కేసులో తదుపరి చర్యలకు ఉపక్రమించాలని సీఐడీ భావిస్తోంది. వారిద్దరినీ ఆంధ్రప్రదేశ్‌కు పిలిపించి మరీ విచారించేందుకు సీఐడీ సంసిద్ధమవుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

జిల్లా వార్తలు

మంత్రి పువ్వాడకు రాములోరి కల్యాణ తలంబ్రాలు



మంత్రికి తలంబ్రాలు అందజేస్తున్న ఈఓ

ఖమ్మంమయూరిసెంటర్: శ్రీరామనవమి పురస్కరించుకుని గత నెల 30వ తేదీన భద్రాచలంలో జరిగిన శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణ తలంబ్రాలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు అందజేశారు. భద్రాచలం ఆలయం ఈఓ రమాదేవి బుధవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి ముత్యాల తలంబ్రాలను అందజేసి పలు అంశాలపై చర్చించారు.

జీ–20 సదస్సులో మహిళా ప్రాంగణం అధికారి విజేత



కేరళ మంత్రి నుంచి జ్ఞాపిక అందుకుంటున్న విజేత

ఖమ్మంఅర్బన్: కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో బుధ, గురువారాల్లో జరుగుతున్న అంతర్జాతీయ మహిళా సాధికారత జీ–20 సదస్సుకు ఖమ్మం మహిళా ప్రాంగణం అధికారి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి వేల్పుల విజేత ఎంపికయ్యారు. బుధవారం సదస్సుకు హాజరైన ఆమె మహిళా సాధికారితపై పలు సెమినార్లలో మాట్లాడారు. ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న సదస్సులో ఆమె పాల్గొనడంపై పలువురు అభినందించారు.

8న చెరుకు క్రషింగ్ ముగింపు

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో ఉన్న మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్‌లో ఈ ఏడాది చెరువు క్రషింగ్ 8వ తేదీన ముగించనున్నట్లు ఫ్యాక్టరీ సీజీఎం కోటయ్య తెలిపారు. 2022–23 సంవత్సరానికి గానుగ ఆడించడాన్ని 8వ తేదీన ముగించనున్న నేపథ్యాన రైతులు ఆలోపే ఫ్యాక్టరీకి చెరుకు తరలించాలని సూచించారు. ఈ ఏడాది ఇప్పటివరకు దాదాపు 4 లక్షల టన్నుల చెరుకు గానుగ ఆడించడానికి సహకరించిన రైతులు, కార్మికులు, ఉద్యోగులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'తపాలా' వడ్డీ పెరిగింది..

- పోస్టల్ పథకాలపై మిత్తి మరింత..
- సీనియర్ సిటిజన్లు, నెలవారీ ఆదాయ పొదుపు పరిమితి పెంపు
- ఈ పథకాల్లో నెలకోసారి వడ్డీ తీసుకునే అవకాశం
- మహిళలు, ఆడపిల్లలకు నూతనంగా పొదుపు పథకం



పథకాల వారీగా వడ్డీ రేట్ల వివరాలు (2023 ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు)

పొదుపు ఖాతా	వడ్డీ (శాతం)
సేవింగ్స్ అకౌంట్స్	4
రికరింగ్ డిపాజిట్	6.2
మంత్లీ ఇన్‌కం స్కీం	7.4
టైమ్ డిపాజిట్ (ఏడాదికి)	6.8
రెండేళ్లు	6.9
మూడేళ్లు	7
ఐదేళ్లు	7.5
సుకన్య సమృద్ధి యోజన	8
పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్	7
సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్	8.2
నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్	7.7
కిసాన్ వికాస పత్రం	7.5

ఖమ్మంగాంధీచౌక్: తపాలా శాఖ నిర్వహిస్తున్న పలు పథకాలపై కేంద్ర ప్రభుత్వం వడ్డీ రేట్లు పెంచింది. పేద, మధ్య తరగతి వర్గాలకు ప్రయోజనం కలిగేలా ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం (ఏప్రిల్ నుంచి జూన్ వరకు)నకు వడ్డీ రేట్లు పెంచడమే కాక ఎంపిక చేసిన పొదుపు పథకాలకు పరిమితి కూడా పెంచారు. నూతన వడ్డీ రేట్లు, కొత్త పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోస్టల్ శాఖ ఉద్యోగులు సిద్ధమవుతున్నారు. ప్రధానంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్య తరగతి వర్గాలకు ఈ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఖమ్మం డివిజన్ తపాలా శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న తపాలా అధికారులు పలు ప్రాంతాల్లో ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

పరిమితి పెంపు.. వడ్డీలో మార్పులు

సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీంలో అత్యధిక పొదుపును రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షలకు పెంచారు. అంతేకాక ఈ పథకంలో మూడు నెలలకోమారు వడ్డీ తీసుకునే సౌకర్యం కూడా కల్పించారు. అలాగే, నెలవారీ ఆదాయ పథకం వ్యక్తిగత ఖాతాలో అత్యధిక పొదుపును రూ.4.5 లక్షల నుంచి రూ.9 లక్షలకు పెంచారు. ఈ పథకంలోనూ నెలనెలా వడ్డీ పొందే అవకాశం ఉంది. ఇక మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ 2023 పేరుతో కొత్త పథకాన్ని అమలు చేస్తున్నారు. మహిళలు, ఆడపిల్లల కోసం వన్‌టైం స్మాల్ సేవింగ్ స్కీంగా దీనిని రూపొందించారు. ఈ పథకంలో 2025 వరకు చేరే అవకాశం కల్పించారు. ఈ పథకంలో రూ.2 లక్షల వరకు పొదుపు చేసుకునే అవకాశం ఉంది. రెండేళ్ల కాలపరిమితిలో పాక్షికంగా నగదు ఉపసంహరించుకునే వెసలుబాటు కూడా ఉంది.

బ్యాంకులతో పోలిస్తే అధిక వడ్డీ



పొదుపు పథకాలపై బ్యాంకులతో పోలిస్తే తపాలా శాఖ అధిక వడ్డీ చెల్లిస్తోంది. వివిధ వర్గాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పొదుపు పరిమితి కూడా పెంచారు. తపాలా శాఖలో పొదుపు పథకాల్లో చేసిన మార్పులతో లబ్ధి జరగనున్నందున ప్రజలు వినియోగించుకోవాలి. ఆయా పథకాలతో ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకుళ్లేందుకు తపాలా శాఖ ద్వారా కృషి చేస్తున్నాం.

– బి.రవికుమార్, తపాలా సూపరింటెండెంట్, ఖమ్మం డివిజన్

సత్తుపల్లి ట్రంక్‌కు నిధులు ఇవ్వండి

సీఎం కేసీఆర్‌ను కోరిన మాజీ మంత్రి తుమ్మల

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు సాగునీరు నీరందించే సీతారామ ప్రాజెక్టు 9, 10వ ప్యాకేజీల్లో భాగంగా పెండింగ్ పనులు, సత్తుపల్లి ట్రంక్ ద్వారా నీటి సరఫరా కోసం చేపట్టాల్సిన పనులకు నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. బుధవారం ఆయన ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. రెండు ప్యాకేజీల్లో 4.470 కిలోమీటర్ నుంచి 42.775 కిలోమీటర్ వరకు కొంత మెయిన్ కాల్వ, టన్నెల్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని సీఎంకు వివరించానని తెలిపారు. భూసేకరణతో పాటు కాల్వ పనుల పూర్తికి అవసరమైన రూ.52,34,75,998లను త్వరగా విడుదల చేయాలని కోరినట్లు చెప్పారు. కాల్వ ఎగువ భాగంలో మూడు పంపు హౌస్‌లు పూర్తయ్యాయని, టన్నెల్ కూడా పూర్తయితే ఈ సంవత్సరం బేతుపల్లికి నీళ్లు అందుతాయని చెప్పగా, స్పందించిన సీఎం త్వరలోనే మంత్రి హరీశ్‌రావు ఆయా పనులపై సమీక్షిస్తారని చెప్పారని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీకి పతనం తప్పదు

భద్రాద్రి జిల్లా జెడ్పీ చైర్మన్ కనకయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కోరం కనకయ్య

గార్ల: రాష్ట్రంలో ప్రజావ్యతిరేకత పాలన కొనసాగిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి రానున్న రోజుల్లో పతనం తప్పదని.. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని భద్రాద్రి కొత్తగూడెం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. మహబూబాబాద్ జిల్లా గార్లలోని వర్తక సంఘం భవనంలో బుధవారం జరిగిన పొంగులేటి, కోరం కనకయ్య వర్గీయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో 1,200మంది ఆత్మబలిదానాలు చేసుకోగా.. వారి త్యాగాలతో గద్దెనెక్కిన కేసీఆర్ నాటి నుంచి నేటి వరకు అక్రమ ఆస్తులు కూడబెట్టారని విమర్శించారు. అందుకే రాబోయే ఎన్నికల్లో దేశంలోని మిత్రపక్షాలకు ఖర్చు చేస్తానని ప్రకటించారని అన్నారు. స్కాంలు, పేపర్ లీకేజీలతో సీఎం బిజీగా ఉంటూ బంగారు తెలంగాణ నిర్మాణాన్ని గాలికి వదిలేశారని ఎద్దేవా చేశారు. త్వరలోనే మెజార్టీ ప్రజల ఆమోదం మేరకు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఏ పార్టీలో చేరాలనేది నిర్ణయిస్తారని కనకయ్య పేర్కొన్నారు. ఈసమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, నాయకులు గుండా వెంకట్‌రెడ్డి, మీరాపఠాన్, బాదావత్ రవి, యాకూబ్‌పాషా, వెంకటేశ్వర్లు, అశోక్, బాలూనాయక్, తాళ్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రెండు రాష్ట్రాలస్థాయి కబడ్డీ పోటీలు



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

తల్లాడ: ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కుర్నవల్లిలోని వేంకటాచలపతి దేవాలయంలో జరిగే తిరుకల్యాణోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలస్థాయి కబడ్డీ పోటీలు బుధవారం రెండోరోజుకు చేరాయి. రెండోరోజు ఆర్ఆర్సీ సికింద్రాబాద్–కర్నూలు జట్లు తలపడగా కర్నూలు, విశాఖపట్నం–గుబ్బగుర్తి (ఖమ్మం) జట్ల నడుమ పోటీలో విశాఖపట్నం, భద్రాద్రి కొత్తగూడెం–బాపట్ల జట్ల నడుమ పోటీలో భద్రాద్రి కొత్తగూడెం జట్టు గెలుపొందాయి. ఈ పోటీలకు రిఫరీలుగా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి క్రిస్టోఫర్‌తో పాటు వీరరాఘవయ్య, సత్యనారాయణ, నాగప్రసాద్ వ్యవహరించారు. తొలుత క్రీడాకారులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ పరిచయం చేసుకోగా, పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల నుంచి పెద్దసంఖ్యలో యువత తరలివచ్చింది.

పోరాటాల ద్వారానే పార్టీ విస్తరణ

సీపీఐ జాతీయ సమితి సభ్యుడు హేమంత రావు



సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజా పోరాటాల ద్వారానే పార్టీ విస్తరణ సాధ్యమవుతుందని.. ఈ విషయాన్ని గుర్తెరిగి ప్రజా పోరాటాలకు కమ్యూనిస్టు శ్రేణులు సిద్ధం కావాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు సూచించారు. స్థానికంగా ప్రజాసమస్యలను గుర్తిస్తూ వాటి పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో సిద్ధినేని కర్ణకుమార్ అధ్యక్షతన బుధవారం జరిగిన సీపీఐ జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసమస్యలను వదిలేసిన పాలకులు.. ఓటు బ్యాంకు రాజకీయాలకు అలవాటు పడి సంపన్న వర్గాలకు కొమ్ము కాస్తున్నారని తెలిపారు. ప్రధాని మోడీ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. రోడ్లు, విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్లు, నౌకాశ్రయాలు, విలువైన భూములు, ఖనిజ సంపద, కర్మాగారాలే కాక జాతిరత్నాలుగా చెప్పుకునే అనేక సంస్థలను మోడీ కారుచౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని తెలిపారు. ఇదిలాగే కొనసాగితే ప్రజాస్వామ్య మనుగడ, లౌకిక వాదానికి ప్రమాద ఘంటికలు మోగడం ఖాయమని హేమంతరావు చెప్పారు. కాగా, ప్రజలను చైతన్యపరిచి మతోన్మాద రాజకీయ శక్తులను నిలువరించేందుకు ఈనెల 14 నుండి జన చైతన్య యాత్ర చేపడుతున్నామని, ఈ యాత్ర సత్తుపల్లిలో మొదలై జిల్లావ్యాప్తంగా సాగుతుందని తెలిపారు. ఇక ఈనెల 9న హైదరాబాద్‌లో జరిగే వామపక్షాల బహిరంగ సభకు జిల్లా నుంచి కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు దండి సురేష్, మహ్మద్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి మార్కెట్‌కు రూ.2.65 కోట్ల ఆదాయం



సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

సత్తుపల్లి: సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్‌కు తాజాగా ముగిసిన ఆర్థిక సంవత్సరం (2022–23)లో గణనీయమైన ఆదాయం లభించింది. ఈ ఆర్థిక సంవత్సరం రూ.1.80 కోట్ల లక్ష్యం విధించగా, రూ.2.65 కోట్ల ఆదాయం నమోదైందని మార్కెట్ కార్యదర్శి జి.సత్యనారాయణ వెల్లడించారు. మార్కెట్ పరిధిలోని సత్తుపల్లి చెక్‌పోస్టు ద్వారా రూ.1.01 కోట్లు, గంగారం చెక్‌పోస్టు ద్వారా రూ.1.03 కోట్లతో పాటు వెంకటాపురం చెక్‌పోస్టు ద్వారా రూ.60.05 లక్షల ఆదాయం లభించింది. వెంకటాపురం చెక్‌పోస్టుకు రూ.15 లక్షల లక్ష్యం విధించగా రూ.60.05 లక్షల ఆదాయం రావడంతోనే రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. కాగా, 2021–22 ఆర్థిక సంవత్సరంలోనూ రూ.1.47 కోట్ల లక్ష్యానికి రూ.1.67 కోట్ల ఆదాయం వచ్చిందని కార్యదర్శి పేర్కొన్నారు.